క్లుప్తంగా

మహిళపై దాడి

నరసరావుపేట టౌన్: మహిళపై దాడి చేసిన సంఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ ఆదివారం తెలిపారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలానికి చెందిన సాతులూరి రెబ్కా భర్తతో విడిపోయి ఇద్దరు పిల్లలతో కలిసి రామిరెడ్డిపేటలో ఉంటూ చీరల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తుంది. ఈ క్రమంలో క్రిస్టియన్ పాలెంకు చెందిన చాట్ల సూర్య ప్రకాష్‌తో ఐదేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత మూడు సంవత్సరాలు ఇద్దరూ సహజీవనం చేశారు. గత రెండేళ్ల నుంచి సూర్య ప్రకాష్ తరుచూ తిడుతూ, కొడుతూ ఇబ్బందులకు గురిచేస్తుండటంతో రెబ్కా అతనికి దూరంగా ఉంటుంది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా రెబ్కా ఉన్న సమయంలో సూర్య ప్రకాష్ వచ్చి ఆమెపై దాడికి పాల్పడటంతో ఎడమ కంటి భాగంపై రక్త గాయం అయ్యింది. అతని వెంట తెచ్చుకున్న చాకుతో చంపుతానని బెదిరించాడు. బాధితురాలు బంధువుల సహాయంతో ఏరియా వైద్యశాల్లో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ ఈ మేరకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లైబ్రేరియన్ బాధ్యతలు స్వీకరణ

నూజెండ్ల: మండల కేంద్రమైన నూజెండ్లలోని శాఖా గ్రంథాలయ పర్యవేక్షకుడిగా గంగవరపు అర్జున్ ఆదివారం విధుల్లో చేరారు. ఇప్పటివరకు శావల్యాపురంలో పనిచేస్తూ బదిలీపై నూజండ్లకు రావటం జరిగిందని ఆయన తెలిపారు. దశాబ్ద కాలం పైగా ఖాళీగా ఉన్న లైబ్రెరియన్ పోస్టు ఎట్టకేలకు భర్తీ చేయటంతో పాఠకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫొటోగ్రాఫర్లకు సన్మానం



వినుకొండ: ఆర్ట్ ఫొటోగ్రఫీ వంటి కళలో అంతర్జాతీయంగా రాణిస్తున్న వినుకొండ ఫొటోగ్రాఫర్లను రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏరువ వెంకట నారాయణ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు పోటీలకు వెళ్లడానికి అవసరమైన ప్రాథమిక వసతులను సమకూర్చడానికి క్లబ్ సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డులు పొందిన ఫొటోగ్రాఫర్లు వంగపల్లి బ్రహ్మయ్య, కేసనపల్లి సుబ్బారావు, ఫొటోగ్రాఫర్లు కోకా సుబ్బారావు, పాపగంటి వినీల్, గోళ్ల మల్లికార్జునలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎస్కే బాజీ, కోశాధికారి పొత్తూరి నవీన్, క్లబ్ జిల్లా ముఖ్యులు పాల్గొన్నారు.

మండపాలకు తరలుతున్న గణేశులు



నాదెండ్ల: గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 27వ తేదీన వినాయక చతుర్థిని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో 150 వరకూ విగ్రహాలు ఏర్పాటు కానున్నాయి. ఆలయాలు, ప్రత్యేక చలువ పందిళ్లలో వినాయక విగ్రహాలు ప్రతిష్టించనున్నారు. సాతులూరు గ్రామంలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని కొనుగోలు చేసి బాణసంచా కాలుస్తూ ఊరేగింపుతో గ్రామానికి తరలించారు. మూడు, ఐదు, ఏడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం చేయనున్నారు. ఇప్పటికే విగ్రహాల ఏర్పాటుకు పోలీసులు నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. విగ్రహం ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం చేసే ప్రదేశం, తేదీ తదితర వివరాలు పోలీసులకు ఇవ్వాల్సి ఉంది. డీజేలకు అనుమతి లేదని ఇప్పటికే పోలీసులు ప్రకటించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

చిలకలూరిపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కమిటీ చైర్మన్‌గా షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్‌గా పిల్లి కోటేశ్వరరావు, మెంబర్లుగా జాష్టి రవి, పోపూరి హనుమంతరావు, ఆముదాల లీలాకిషోర్, చెన్నంశెట్టి పద్మ, నెల్లూరి శాంతిప్రియ, గుదే అంజలి, పల్లపు సుమలత, అనంత వీరకుమారి, కూరపాటి మల్లేశ్వరి, మందా దుర్గాభవాని, మొగిలి వెంకటనారాయణ, కాట్రు శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ నబి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా నివాస ప్రాంతమైన గుర్రాల చావిడి వీధి నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా రాహు-కేతు పూజలు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతు పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వార్లను విశేషంగా అలంకరించారు. ఆదివారం నాడు రాహు-కేతువులను ప్రసన్నం చేసుకుంటే దోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

పాలకుల నిర్లక్ష్యం.. పారిశుద్ధ్యం హీనం

- 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట'లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ సాగిన వైనం



బాబాపేట హోల్‌సేల్ మార్కెట్‌లో అధ్వాన పారిశుద్ధ్య పరిస్థితులపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణంలోని అధ్వాన పారిశుద్ధ్యం, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, 14నెలల కూటమి ప్రభుత్వ అధమ పాలనకు ప్రతిబింభంగా కన్పిస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వందలాది మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణ పురవీధుల్లో ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం నిర్వహించారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ద్విచక్రవాహనాలపై పర్యటిస్తూ వీధుల్లో కాలినడకన తిరుగుతూ పర్యటన కొనసాగించారు. ఏడవ వార్డు బాబాపేటలోని నాగసరపు సుబ్బరాయగుప్తా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ లోపల పరిస్థితిని పరిశీలించారు. అక్కడ రెండు, మూడు నెలల నుంచి మున్సిపల్ సిబ్బంది చెత్త తీయని పరిస్థితిని గమనించారు. కుళ్లిపోయిన కూరగాయలు పురుగులు పట్టి ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండి పోయిందని, మార్కెట్ వ్యాపారులు ఏడాదికి రూ.26లక్షలు అద్దె, ట్యాక్స్‌ల రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తున్నా మున్సిపల్ పారిశుద్ధ్య వర్కర్ ఒక్కరు కూడా ఈ మార్కెట్ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదంటూ గోపిరెడ్డి మండిపడ్డారు. ఇక్కడ చెత్త శుభ్రం చేయడానికి కనీసం నెలరోజులుగా ఎవరూ రావడం లేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన బుట్టదాఖలు చేస్తున్నారని, ఈ పరిస్థితి ఇదేరకంగా కొనసాగితే త్వరలో మార్కెట్ మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందంటూ వ్యాపారులు వాపోతున్నారని చెప్పారు. తక్షణమే ఇక్కడి అపరిశుభ్రమైన ప్రాంతాన్ని శుభ్రంచేసి ప్రతిరోజు ఇక్కడ క్లీనింగ్ జరిగే విధంగా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. అలాగే గిరి స్కూలు పరిసరాల్లో ఉన్న ఓ ఇంటిముందున్న డ్రెయిన్‌లోని మురుగు పారక నిలిచిపోయి రోడ్డుపై పారుతుండటాన్ని పరిశీలించారు.

మృతదేహాలను ఖననం చేయలేని స్థితిలో ఖబర్‌స్థాన్

ముస్లిం ఖబరస్తాన్ పరిశీలించగా, మనిషి ఎత్తు పిచ్చి గడ్డి మొలిచి, మృతదేహాలు ఖననం చేసే పరిస్థితి లేకపోవటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఒకదానిపై ఒకటి మృతదేహాల్ని ఖననం చేయాల్సిన దుస్థితిలో ముస్లిం ఖబరస్థాన్ ఉండటం శోచనీయమన్నారు. లైట్లు వెలగడం లేదని అన్నారు. గతంలో ప్రభుత్వంలో ముస్లింల కోసం ఆరామా క్షేత్రాన్ని నిర్మించామని, దాన్ని వైఎస్సార్ సీపీ నిర్మించిందన్న నెపంతో కూటమి నేతలు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, తక్షణమే ఆరామా క్షేత్రాన్ని శుభ్రంచేసి వినియోగంలో తీసుకొని రావాలని డిమాండ్ చేశారు. ముస్లిం ఖబరస్తాన్ కమిటీ వారికి పూర్తిగా మెయింటెన్స్ బాధ్యతలు ప్రభుత్వం అప్పజెప్పాలని, వారిచేత వెంటనే ఖబరస్తాన్‌ను శుభ్రం చేయించాలని అన్నారు. పార్టీ ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఈఎం స్వామి, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, పట్టణ వర్కింగ్ అధ్యక్షుడు నిడమానూరి సురేంద్ర, అచ్చిశివకోటి, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాష్టారు, సయ్యద్ ఖాదర్‌బాషా, గంటెనపాటి గాబ్రియేలు, మైలేరి మార్కు, షేక్ జాఫర్, గుంటి ప్రశాంత్, డీలర్ జిలాని, షేక్ ఖాజాలతో పాటు పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై పేరు ధ్వంసం



శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: గత ప్రభుత్వంలో 20వ వార్డులో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాటుచేసిన శిలాఫలకంపై తన పేరును ధ్వంసం చేయటంపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గుడ్‌మార్నింగ్ నరసరావుపేట సందర్భంగా 20వ వార్డులోని శిలాఫలకాన్ని పరిశీలించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు మేరకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదనే విషయం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

280 మంది రోగులకు పరీక్షలు



శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ గుంటుపల్లి దివ్యతేజ, డాక్టర్ గుంటుపల్లి భవ్యతేజ

యద్దనపూడి: జి.బి.ఆర్ ఫౌండేషన్ సహకారంతో బాసట ఆధ్వర్యంలో ఆదివారం కామ్రేడ్ పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం వంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు నిపుణులైన వైద్యులు పర్యవేక్షణలో వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, రెండు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు గుంటుపల్లి దివ్యతేజ, గుంటుపల్లి భవ్యతేజ రోగులను పరిశీలించి, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ప్రయోజనకరమైన సూచనలు, సలహాలు అందించారు. శిబిరంలో మొత్తం 280 మంది రోగులు వైద్య సేవలు పొందారు. బాసట అధ్యక్షుడు నూతలపాటి కాశిదాసు, కార్యదర్శి సామినేని శ్రీనివాస్, ట్రెజరర్ కేతా రామబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, రావూరి సురేష్, బచ్చు రాజేష్, గోనుగుంట్ల కిరణ్, ముత్తవరపు పవన్‌సాయి, ముత్తవరపు ధర్మ పర్యవేక్షించగా, నారాయణ హైస్కూల్ విద్యార్థినులు వాలంటీర్లుగా పనిచేసి సేవా భావాన్ని ప్రదర్శించారు.

కొనసాగుతున్న మహిళల బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న క్రీడాకారిణులు

వినుకొండ: నరసరావుపేట రోడ్డులోని నిర్మలా స్కూల్లో గుంటూరు బాల్ బ్యాడ్మింటన్ మహిళల సీనియర్, సబ్ జూనియర్ జట్లకు జరుగుతున్న శిక్షణా శిబిరాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ వై. శ్రీనివాసరావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ క్యాంప్ ఈ నెల 28వరకు జరుగుతుందని, అనంతరం ఈ నెల 29 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే 11వ రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారిణులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ జాయింట్ సెక్రటరీ జోనా నాయక్, సుపీరియర్ సిస్టర్ సిసిలీ, ప్రిన్సిపాల్ సిస్టర్ రాణి, ఏడీ ఆంజనేయులు, పీఈటీ శ్రీనివాసరావు, సంధ్య, ఉపాధ్యాయులు, జిలానీ పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సంబరాలకు పూర్వ విద్యార్థులు సమాయత్తం



సత్తెనపల్లి: స్వర్ణోత్సవ సంబరాలకు పూర్వ విద్యార్థులు సమాయత్తమవుతున్నారు. పూర్వ విద్యార్థుల కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన పట్టణంలో సభ్యులు ఆదివారం సమాయత్త సమావేశం నిర్వహించారు. సత్తెనపల్లి శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాలలో 1974–75 బ్యాచ్ 10వ తరగతి 150 మంది విద్యార్థులు ఇప్పటికే రెండు పర్యాయాలు సమావేశమయ్యారు. 3వ సమావేశం స్వర్ణోత్సవ సంబరాలను డిసెంబర్ 14న నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు నిధుల సేకరణ, మరోసారి సమాయత్త సమావేశానికి తీర్మానించారు. ఈ సందర్భంగా మట్టా సింహాచలం రూ.15,116, కొప్పురావూరి పెద్ద కనకయ్య రూ.11,116, జక్కుల లక్ష్మీనారాయణ రూ.10,116, తాళ్లూరి మల్లికార్జునరావు రూ.10,116, జవ్వాజి కనకదుర్గారావు రూ.5,116, కొప్పురావూరి చిన్న కనకయ్య రూ.5,116, షేక్ ఇబ్రహీం రూ.5,116, అన్నం లక్ష్మణకుమార్ రూ.3,116 అందిస్తామని ప్రకటించారు. కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొప్పురావూరి చిన్న కనకయ్య, సభ్యులు పాల్గొన్నారు.

• తప్పని నిరీక్షణ.. మహిళల వేదన



సత్తెనపల్లిలోని అచ్చంపేట పాయింట్‌లో బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలలకు ఎట్టకేలకు అమలకు పూనుకుంది. స్త్రీ శక్తిపై విజయోత్సవ సభలు పెట్టి ఊదరగొట్టడం, ప్రతిపక్షాన్ని విమర్శించడం తప్ప అసలు కూటమి నేతల్లో మార్పు కనిపించడం లేదు. అరకొర బస్సులు, బస్టాండ్‌లో అధ్వాన పరిస్థితులను పట్టించుకోకుండా ప్రారంభించేశామంటూ గొప్పలు చెప్పడాన్ని మహిళలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సరిపడా బస్సులు లేక మహిళలు నిరీక్షించాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ఇప్పటికైనా మహిళలకు సరిపడా బస్సులు కేటాయించడంతో పాటు బస్టాండ్‌లో అత్యవసరానికి పరుగులు తీయకుండా చూడాలని మహిళలు కోరుతున్నారు.

కొనసాగిన రక్తదాన శిబిరం



చిలకలూరిపేట: బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం చిలకలూరిపేట శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం రెండో రోజు కొనసాగింది. పట్టణంలోని సీపీటీ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో తొలిరోజు శనివారం 9మంది రక్తదానం చేయగా, రెండో రోజైన ఆదివారం ఐదుగురు రక్తదానం చేశారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరంలో భాగంగా సోమవారం మూడో రోజు కూడా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సిస్టర్ బీకే శాంతి తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. నిర్వాహకులు కందా భాస్కరరావు, సురేష్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: స్థానిక బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కార్యాలయంలో ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజయోగిని దాది ప్రకాశమనిజి 18వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 24 మంది రక్తదానం చేశారు. ఆగస్టు 22 నుండి 25 వరకు దేశవ్యాప్తముగా 1500 సేవ కేంద్రాలలో ఒకేసారి లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించాలనే లక్ష్యంతో భారీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పట్టణ ఇన్‌చార్జి బీకే అరుణ అక్కయ్య పేర్కొన్నారు. లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఎంఏఎం కాలేజీ చైర్మన్, రెడ్‌క్రాస్ చైర్మన్ శేషగిరిరావు, కార్యదర్శి శ్రీనివాసగుప్తా, కోశాధికారి డాక్టర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, పెరుమాళ్ళ సత్యనారాయణ, దోగిపర్తి విజయ్‌కుమార్, అయినవోలు సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కాలిగ్రఫీలో శిక్షణ



రొంపిచర్ల: సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల విద్యార్థులకు ఇంగ్లీష్ కాలిగ్రఫీలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు షేక్ జున్ను సాహెబ్, ఎం.బురాన్ మాట్లాడుతూ మంచి చేతిరాత విద్యార్థులలో ఆత్మవిశ్వాసం నింపుతుందన్నారు. తద్వారా విద్యార్థులు చదువులో రాణించేందుకు దోహదపడుతుందని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సయ్యద్ జిలానీ, షేక్ మహబూబ్ సుభాని, ఆదెయ్య, పుల్లయ్య, అబ్దుల్ సత్తార్, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు బండారుపల్లి నాగేశ్వరరావు, అచ్చుల సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితోనే యువతకు మంచి జీవితం

అచ్చంపేట: విద్యాభివృద్ధితోనే యువత మంచి జీవితం సాధ్యపడుతుందని, అందుకు ప్రతిభ కలిగిన విద్యార్థులకు చేయూతనిచ్చి వారి భవిష్యత్‌కు బంగారుబాట వేసే లక్ష్యంతో స్నేహహస్తాలు ఫౌండేషన్ పనిచేస్తున్నదని ఆ సంస్థ ఫౌండర్ కూరపాటి శివరాం అన్నారు. ఆదివారం ఆయన అచ్చంపేటలో బీ ఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని లక్ష్మికి కాలేజి ఫీజు నిమిత్తం రూ.65,000 చెక్కును అందచేశారు. తమ సంస్థ ద్వారా గత మూడేళ్లుగా ఏడాదికి రూ.65,000 చెక్కును ఇస్తున్నామని, ఆదే విధంగా ఈ ఏడాది కూడా ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను చేయూతనివ్వడం ద్వారా వారి భవిష్యత్‌కు బాటలు వేసినట్లు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఇకపై తరచూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

టూటౌన్ సీఐ హైమారావు



డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న టూటౌన్ ఎస్ఐ అశోక్, సీఐ హైమారావు

నరసరావుపేట టౌన్: పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు టూటౌన్ సీఐ హైమారావు ఆదివారం తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఇకపై తరచూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడతామన్నారు. శనివారం రాత్రి కోట సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, పల్నాడు బస్టాండ్ సెంటర్‌లలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. 100 ఎంఎల్ కంటే ఎక్కువ సేవించిన వారికి రూ.15 వేలు జరిమానా విధించవచ్చన్నారు. రెండవసారి పట్టుబడితే నెల రోజుల పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వాహనదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రతిరోజు తనిఖీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. యజమానులు వాహనాలకు సంబంధించి పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దాసునాయన మఠంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు



మాట్లాడుతున్న కోటానాయక్ శాంతి నంద, పక్కనే పలు పీఠాల అధిపతులు

నాదెండ్ల: జాతీయ రహదారి పక్కనే గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ ఆంజనేయస్వామి ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠంలో ఆదివారం మఠాధిపతుల ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి మఠం పీఠాధిపతి కటారు దాసునాయన అధ్యక్షత వహించగా, చిలకలూరిపేటకు చెందిన కోటా నాయక్ శాంతి నంద, త్రిపురాంతకంకు చెందిన సుబ్బయ్య స్వామి, వివేకానంద వెంకటాచార్యులు, చుండూరుకు చెందిన తురియానంద గురూజీ, అత్తులూరుకు చెందిన సిద్ధానంద గురూజీ, గణపవరంకు చెందిన ఆదినారాయణ శాంతినంద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటానాయక్ శాంతినంద మాట్లాడుతూ అచల దాసునాయన మఠంలో కొన్నేళ్ళుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరాటంకంగా జరగటం అభినందనీయమన్నారు. పలువురు స్వామీజీలు ప్రవచనాలు, భగవద్గీత అంతరార్థం, వేదాంత పరిచయం, వేద విజ్ఞానం, ఆత్మజ్ఞానాన్ని పొంది జీవన్ముక్తులగుట అనే అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమాలను నూతలపాటి హనుమాయమ్మ, కటారు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల

ఎన్ఎస్పీ డీఈ విజయలక్ష్మి



అద్దంకి బ్రాంచ్ కెనాల్

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగుకు సాగర్ జలాలు విడుదల చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా డీఈ విజయలక్ష్మి మాట్లాడుతూ సాగర్ జలశయం నిండుగా నీరు ఉందని సాగుకు ఏలాంటి ఇబ్బందులు లేవన్నారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 1250 క్యూసెక్కులు సాగు నీరు విడుదల చేయగా 8 మేజరు కాల్వలు ఉండగా 400 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన నీటిని ప్రకాశం జిల్లాకు 850 క్యూసెక్కుల కేటాయించామన్నారు. చివరిభూముల వరకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టామన్నారు. రైతులు ఎన్ఎస్పీ అధికారులకు సహకరించాలన్నారు. ప్రస్తుతం నారుమడులు రైతులు సాగు చేస్తున్నారని సాగర్ జలాలు వృథా కాకుండా ఉండటానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సాగర్ జలాలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పంటల ఆధారంగా సాగర్ జలాలు విడుదల పెంచుతామన్నారు. ప్రకాశం జిల్లా పరిధిలో కెనాల్ పై నూతనంగా ఏర్పాటు చేస్తున్న రెండు వంతెనలు నిర్మాణ పనులు పూర్తి అయినట్లు తెలిపారు. ఏఈ పోట్లూరు లక్ష్మినారాయణ ఉన్నారు.

కమ్యూనిస్టు యోధుడు సురవరం



సురవరం ఫొటో వాల్‌పోస్టర్లు ప్రదర్శిస్తున్న పీడీఎం నాయకులు

నరసరావుపేట: ఈ నెల 23వ తేదీన మృతిచెందిన సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి, పార్లమెంట్ మాజీ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డికి వివిధ ప్రజాసంఘాల నాయకులు నివాళులు అర్పించారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్‌కేటీ కాలనీలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరై ఆయన చిత్రపటం ఉన్న వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించారు. విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా అనేక పోరాటాలు చేసి, విశాలాంధ్ర విలేఖరిగా పనిచేసి, వామపక్ష ఐక్య ప్రజా ఉద్యమాలలో, రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు చేసిన కమ్యూనిస్టు యోధుడు సురవరం అని పీడీఎం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు పేర్కొన్నారు. అలాగే చంద్రబాబు నాయుడు తెచ్చిన విద్యుత్ సంస్కరణలు వ్యతిరేకిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన పోరాటంలో ఆయన పాల్గొన్నారన్నారు. పీడీఎం జిల్లా అధ్యక్షుడు మస్తాన్‌వలి, బీసీ నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలి



పెదకూరపాడు: పర్యావరణాన్ని పరిరక్షించేలా మట్టి గణపతిని పూజించాలని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడులోని జన చైతన్య సమితి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను సంస్థ ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. 75 తాళ్లూరు మాజీ ఎంపీటీసీ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయన్నారు. జన చైతన్య సమితి నిర్వాహకులు షేక్ లియాకత్ అలీ మాట్లాడుతూ చెరువులు, జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థాల వినియోగాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఒంటిపులి అంకమ్మరావు, బెజ్జం నాగేశ్వరరావు, బొంత బుజ్జిబాబు, శ్రీ పాద రామకోటిరెడ్డి, మాచర్ల జకరయ్య తదితరులు పాల్గొన్నారు.